రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## పరుపుల తయారీ గోదాములో అగ్నిప్రమాదం -దాదాపు రూ.50 లక్షల ఆస్తి నష్టం


మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

**ఘట్‌కేసర్, నవంబరు 20, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని పరుపుల తయారీ గోదాములో అగ్నిప్రమాదం సంభవించి దాదాపు రూ.50 లక్షల ఆస్తి నష్టం జరిగిన సంఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్ కేపాల్ వద్ద జాతీయరహదారి పక్కన ఉన్న పరుపుల తయారీ ఫోమ్ గోదాములో గురువారం ఉదయం 9:30 నుంచి 10 గంటల మధ్య మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించింది. కార్మికులు గమనించి నీటితో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. స్థానికులు ఫైర్‌కు సమాచారం ఇవ్వడంతో రెండు అగ్నిమాపక వాహనాలతో సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పించారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు గోదాములో లేకపోగా గదుల్లో ఉండటంతో ప్రాణనష్టం తప్పింది. మంటలకు కేపాల్ అవుషాపూర్, కొండమడుగుమెట్ పరిసర ప్రాంతమంతా నల్లటిపొగతో కమ్ముకుంది. ఘట్‌కేసర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మంటలు పూర్తిగా ఆర్పేవరకు దగ్గరుండి కాలిపోయిన సామాగ్రి, యంత్రాలను పరిశీలించి వివరాలు సేకరించారు. జేసీబీతో కాలిపోయిన యంత్రాలు, పరికరాలను బయటకు తొలగించారు. పరుపుల తయారీ కోసం ఇక్కడ గత రెండు నెలలుగా గోదాములో సామాగ్రిని భద్రపరిచారని గోదాములో విద్యుత్ సరఫరా లేదని తెలిపారు. గోదాముకు పరిశ్రమల శాఖ నుంచి ఇంకా అనుమతులు రాలేదని అగ్నిప్రమాదంలో దాదాపు రూ.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. రహదారిపై వెళ్తున్న వాహనదారులు సెల్‌ఫోన్‌లో విడియోతీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. ఈమేరకు గోదాము యాజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

# డబుల్ దందా

## కేటాయింపునకు ముందే ఇళ్ల కబ్జా

- షాద్‌నగర్ నియోజకవర్గానికి 1,720 డబులు బెడ్‌రూం ఇళ్లు మంజూరు
- అసంపూర్తి నిర్మాణాల కారణంగా స్వాధీనం చేయటంలో జాప్యం
- తాజాగా మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి
- బిఆర్ఎస్ హయాంలో రూపొందించిన జాబితా రద్దుకు నిర్ణయం
- ఎంపిక తీరు లోపభూయిష్టంగా ఉందని కాంగ్రెస్ ఆరోపణ
- పారదర్శకంగా అర్హుల ఎంపికకు కసరత్తు
- ఇంతలోనే పాత జాబితాలో కొందరు అత్యుత్సాహం
- అధికారికంగా కేటాయింపులు కాకుండానే పోటాపోటీగా ఇళ్లకు తాళాలు
- ఒకరు వేసిన తాళం బద్దలు కొట్టి మరీ వేరొకరు స్వాధీనానికి ప్రయత్నం
- ఎమ్మెల్యే ప్రోత్సాహంతోనే అంటూ గోడల మీద రాతలు
- విపక్షాలు రెచ్చగొడుతున్నాయని అధికారపక్షం ఆరోపణ
- ఇళ్లకు తాళాలు వేస్తున్న వారిపై అధికారులు సీరియస్

**షాద్‌నగర్ టౌన్, నవంబరు 20, ప్రభాతవార్త :** షాద్‌నగర్‌లో గత ప్రభుత్వం రెండు పడకల ఇండ్లను నిర్మించింది.. ప్రస్తుత ప్రభుత్వం అక్కడ మౌలిక సదుపాయాల కల్పన ద్వారా వాటిని అర్హులకు కేటాయించటానికి సన్నాహాలు చేస్తోంది. అంతలోనే గందరగోళం మొదలైంది.. ఎవరికివారుగా ఇళ్లను కబ్జా చేయటానికి తెరలేపుతున్నారు. అటు పాలకులు, ఇటు అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుండటంతో పలువురు తమకు తామే అర్హులుగా చెప్పుకుంటూ అత్యుత్సాహాన్ని చూపిస్తున్నారు. బలవంతులదే రాజ్యం అన్నట్టు ఒకరు వేసిన తాళం బద్దలు కొద్ది మరీ మరొకరు తాళాలు వేసుకుంటున్నారు. ఈ వ్యవహారం సిగపట్లు వరకూ రావడంతో స్థానికంగా చర్చనీయాంసమైంది. షాద్‌నగర్ పరిధిలో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చొరవవతో నియోజకవర్గానికి 1720 ఇళ్లను మంజూరు చేశారు. షాద్ నగర్ శివారులో గుండ్లకుంటతో పాటు, సోలిపూర్, దూసకల్, నందిగామ మండలాలలోనూ ఇళ్లను నిర్మించారు. గత ప్రభుత్వం ఇళ్లు కేటాయించేందుకు లబ్ధిదారుల ఎంపిక కూడా చేపట్టింది. అయతే సకాలంలో వాటిని నిర్మించి ఇవ్వడంలో జాప్యం చేసింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ ప్రాంతానికి వచ్చిన నాటి మంత్రి కేటీఆర్ కొంతమంది లబ్ధిదారులను మాత్రం ఎంపిక చేసి వారికి పట్టాలు అందజేశారు. నిన్న మొన్నటి దాకా వాళ్లు మాత్రమే ఇక్కడ ఉంటూ వచ్చారు.

కొత్త ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిధులు సేకరించి ఈ ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించటానికి కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇక్కడ మిషన్ భగీరథ పనులను కూడా ప్రారంభించారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి అనంతరం లబ్ధిదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మరోవైపు గత ప్రభుత్వం నిర్వహించిన లబ్ధిదారుల ఎంపిక లోపభూయిష్టంగా ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. అనర్హులు ఉంటే ఆ జాబితాను రద్దు చేసి అర్హులకు ఎలాంటి అన్యాయం చేయకుండా చూస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ నేపథ్యంలో మిషన్ భగీరథ పనులు ప్రారంభం కావడంతో ఇక ఇళ్ల కేటాయింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని హడావుడి చేస్తూ కొంతమంది ఎవరివారు ఇష్టానుసారంగా దందా చేస్తున్నారు. తమకు నచ్చిన ఇంటికి తాళం వేసి ఇది తమదే నంటూ స్వీయ ప్రకటన చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే సహకారంతో అంటూ అక్కడ బోర్డులు కూడా తగిలించేస్తుండటం పట్ల అధికారపక్షం నేతలకు విస్మయం కలిగిస్తోంది. ఇందంతా విపక్షాలు రెచ్చగొట్టే చర్యలని కొట్టిపారేస్తున్నాయి కాంగ్రెస్ వర్గాలు. పట్టాలు చేతికి ఇవ్వకముందే ఎవరికి వారుగా వచ్చి ఇళ్లను కబ్జా చేసుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తూ ఉండటం పట్ల పలువురు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేతో పాటు అధికారులు కూడా సీరియస్‌గా తీసుకొని ఆక్రమణలను నిర్మూలించకుంటే భవిష్యత్తులో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.


డబల్ బెడ్ రూమ్ ఇళ్లను అధికారికంగా కేటాయించటానిముందే మకాం వేసిన దృశ్యం

# టార్గెట్ ఎవరు?

## కవిత పర్యటనపై బిఆర్ఎస్ నేతల దృష్టి

- పార్టీ నుంచి బయటికి వచ్చాక తొలిసారి జిల్లాలో సుడిగాలి పర్యటన
- బిఆర్ఎస్ అభిమానులపైనే గురి
- కెసిఆర్ కుమార్తెగా పట్టు పెంచుకునేందుకు వ్యూహరచన
- త్వరలో భారీ బహిరంగ సభకు సన్నాహాలు
- జాగృతి బలోపేతం దిశగా అడుగులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబరు 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రముఖులపై విరుచుకుపడుతున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రంగారెడ్డి జిల్లాలో పర్యటనకు గురువారం శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఆమె టార్గెట్ ఎవరు? ఎవరెవరిని తూర్పారపడతారు? విమర్శనాస్త్రాల గురి ఎవరిపై ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంసంగా మారింది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత రాష్ట్ర రాజధాని నగర శివారు ప్రాంతాలైన రాజేంద్రనగర్ చేవెళ్ల, షాద్నగర్, మహేశ్వరం నియోజకవర్గాలలోని పలు మున్సిపాలిటీలు, మండలాలు, పట్టణ కేంద్రాల్లో పార్టీ నాయకులతో సమీక్షలు సమావేశాలు జరిపారు. పార్టీ బలోపేతానికి రంగారెడ్డి జిల్లాలను కేంద్రంగా ఎంపిక చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. గత శాసనసభ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలో అత్యధిక శాసనసభ స్థానాలు బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల నాటికి జిల్లాలోని పలు శాసనసభ స్థానాలలో ఉన్న బిఆర్ఎస్ శ్రేణుల అభిమానాన్ని.. ఆరణను కేసిఆర్ కుమార్తెగా తన వైపు మళ్లించుకునేందుకు పావులు కదుపుఒతంది జాగృతి నాయకులను, తన అభిమానులను తమ వైపు మలుచుకోవడానికి వ్యూహరచనలో భాగంగా రంగారెడ్డిలో పర్యటలను చేపట్టారు. తన సన్నిహితులను కొన్ని నియోజకవర్గాల నుంచి దింపడానికి ఆమె ముందు నుంచి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. త్వరలో జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గంలో భారీ ఎత్తున ఒక చోట బహిరంగ సభ నిర్వహించడానికి ఆమె రంగం సిద్ధం మిగతా 2లో

## పెచ్చులూడిపోతున్నా పట్టించుకోరేం?

- షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి ఏది?
- రోగులను ఆదుకోవాల్సిన బాధ్యత లేదా?
- వంద పడకల స్థాయికి పెంచండి
- ఎమ్మెల్సీ కవిత డిమాండ్
- ఆస్పత్రిలో సౌకర్యాలపై పరిశీలన
- లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టు నిర్మాణంపైనా అసంతృప్తి

2


షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగితో మాట్లాడుతున్న కవిత

## స్థానిక ఎన్నికలకు సిద్ధం

### 22లోపు ఓటర్ల జాబితాలు ఫైనల్

### కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబరు 20, ప్రభాతవార్త:** స్థానిక ఎన్నికలకు జిల్లా నుంచి సిద్ధంగా ఉంటామని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఓటర్లకు సంబంధించి వార్డుల వారిగా ఏమైన తప్పుగా మ్యాపింగ్ ఉంటే దానిని సరిచేసుకోవడానికి పంచాయతీ కార్యదర్శి లేదా యంపిడిఓకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వాటిని నవంబర్ 22న జిల్లా పంచాయతీ అధికారి పరిశీలించి పరిష్కారిస్తారని అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణరావు, రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డి ఇతర ఎన్నికల సంఘం అధికా రులతో కలిసి బీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతి భద్రతల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్‌పి నారాయన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ట్రైనీ కలెక్టర్ హర్స్ చౌదరి, డిపిఓ జయసుధ, పాల్గొన్నారు.

## రాజశేఖర్ హంతకులకు జీవిత ఖైదు తప్పదు

- రాష్ట్ర ఎస్‌సి ఎస్టి కమిషన్ చైర్మన్ వెంకటయ్య
- ఎల్లంపల్లి గ్రామం సందర్శన
- హతుని కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ. 4.12 లక్షల చెక్కు అందజేత
- హైదరాబాద్‌లో రూ.50 లక్షల విలువైన డబుల్ బెడ్ రూమ్
- ఐదు ఎకరాల భూమి కేటాయిస్తామని హామీ

**షాద్‌నగర్, నవంబరు 20, ప్రభాతవార్త :** ఎల్లంపల్లి గ్రామ దళితుడు ఎర్ర రాజశేఖర్ ను అత్యంత ఘోరంగా హత్య చేసిన హంతకులకు భవిష్యత్తులో జీవిత ఖైదు ఎట్టి పరిస్థితుల్లో తప్పదని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామాన్ని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్ అదేవిధంగా షాద్ నగర్ ఆర్డిఓ సరిత, ఏసిపి లక్ష్మీ మీనారాయణ, సిఐ విజయ్ కుమార్ తదితర బృందం సభ్యులు రాజశేఖర్ కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. గ్రామానికి వచ్చిన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాజశేఖర్ భార్య ఎర్రవాణి, తండ్రి మల్లేష్ చేతులకు రూ 4.12 లక్షల రూపాయల చెక్కును రాష్ట్ర ప్రభుత్వం తరపున బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇంత ఘోరమైన సంఘటన జరగడం సభ్య సమా జం తల దించుకోవాలని ఆయన అన్నారు. ప్రేమించిన పాపానికి అతని అన్నను పాషవితంగా హత్య చేయడం ఇది ప్రపంచంలో ఎవరు కనివిని ఎరుగలేదని ఇంతటి అవమానకరమైన ఘటన మరొకటి లేదని చైర్మన్ బక్కి వెంకటయ్య మీడియాతో ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత ఘోరంగా హత్య చేసి దహనం చేయడం వల్ల ఈ సంఘటన తెలిసి ఎంతో హృదయ విదారకంగా తన గుండెలు బరువెక్కాయని అన్నారు. సమాజంలో మానవ తావాదులు మేధావులు విజ్ఞులు ప్రజాసంఘాలు మీడియా ప్రతిని ధులు ప్రతి ఒక్కరు ఈ ఘటనలను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామానికి వచ్చి రాజశేఖర్ కుటుంబ పరిస్థితిని చూస్తే తనకు ఎంతో బాధ మిగతా 2లో


ఎల్లంపల్లిలో బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్‌సి ఎస్‌టి కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య

# 30 ఏళ్ల క్రితమే ఊరు వదిలేశామయ్యా

- రిటైర్ అయ్యాక ఇల్లు కట్టుకొని ప్రశాంతంగా ఉందామని తిరిగొచ్చాం
- ఇంతలోనే ఈ ఘోరం జరిగింది
- రాజశేఖర్ హత్యోదంతంపై ఎమ్మెల్యే ముందు తండ్రి కన్నీరుమున్నీరు
- మానవ మృగాలను వదిలే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే హామీ

**షాద్‌నగర్, నవంబరు 20, ప్రభాతవార్త :** 'హత్యకుగురైన తన కొడుకు ఎర్ర రాజశేఖర్‌కు ఊరే సరిగా తెలియదు. షాద్‌నగర్‌లో ఏవో చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. 30 ఏళ్ల క్రితమే ఊరు విడిచిపెట్టి వెళ్లిపోయాం. ఈ మధ్యకాలంలో నే నేను ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుండి రిటైర్ అయ్యాక ఇల్లు కట్టుకొని ఊర్లో ప్రశాంతంగా ఉందామని ఆశపడ్డాం. ఇంతలోనే ఈ ఘోరం జరిగింది' అంటూ రాజశేఖర్ తండ్రి మల్లేష్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాజశేఖర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు.. ఈ సందర్భంగా మల్లేష్ తన ఆవేదనను వ్యక్తంచేస్తూ కన్నీరు మున్నీరయ్యాడు. 'నా కుటుంబానికి ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఆర్థికంగా భూముల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం తగిన దృష్టితో న్యాయం చేయాలి. హంతకులను కఠినంగా శిక్షి ంచాలి. కాంగ్రెస్ పార్టీ నాయకులు మా కుటుంబాన్ని రక్షి ంచాలి.

**మా ఇంట్లోనూ ప్రేమ పెళ్లిళ్లున్నాయి.. తప్పేంలేదు : ఎమ్మెల్యే**

సమాజంలో ప్రేమించి పెళ్లి చేసుకోవడం నేరం కానే కాదని, రాజ్యాంగం కల్పించిన హక్కును అదేవిధంగా పూర్తి స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి వర్తిస్తుందని కుల ద్రహంకారంతో దళితుడు ఎర్ర రాజశేఖర్ ను హత్య చేయడం అత్యంత దారుణమని దీనిపై ప్రభుత్వం అత్యంత కఠిన చర్యలు తీసుకుని బాధితులకు అండగా నిలబడుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామాన్ని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎస్సీ విభాగం కాంగ్రెస్ నాయకులు బాదేపల్లి సిద్ధార్థ, ఎస్సీ సెల్ అధ్యక్షులు కర్రోళ్ల సురేందర్, యువ నాయకుడు జాంగారి రవి, సీనియర్ నేత ఎర్రోళ్ల జగన్ సింగపాగ అనిల్ కుమార్ నాగి సాయిలు బొరిగి నరేందర్ ప్రధాన కార్యదర్శి జాంగారి జంగయ్య, కొమ్ము కృష్ణ తదితరుల మిగతా 2లో


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర్

# కిరాతకుడికి ఉరి


హత్యకు గురైన చాందిని, పిల్లలు(ఫైల్ ఫొటో)


- భార్య ఇద్దరు పిల్లల హత్య కేసులో శిక్ష ఖరారు
- వికారాబాద్ జిల్లా కోర్టు సంచలన తీర్పు
- 2019లో వికారాబాద్‌లో దారుణం
- ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతోందని అనుమానం
- నిద్రిస్తున్న సమయంలో ఇనుప రాడ్డుతో కొట్టి కిరాతకంగా హత్య
- ఇద్దరు పిల్లల్నీ గొంతు పిసికి చంపిన ప్రవీణ్‌కుమార్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా కోర్టు గురువారం ఒక చారిత్రక తీర్పును వెలువరించింది. 2019 సంవత్సరంలో తన భార్యతో పాటు ఇద్దరు పిల్లలను అత్యంత కిరాతకంగా హత్య చేసిన కేసులో నింతుడైన గురు ప్రవీణ్‌కుమార్‌కు మరణశిక్ష (ఉరిశిక్ష)రూ.10వేల జరిమానా (జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించాలి) విధిస్తూ గౌరవ ప్రిన్సిపల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జీ డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి సంచాలనాత్మక తీర్పు వెలువరించారు. కేసుకు సంభందించి జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కేసు వివరాల్లోకి వెళితే శేరిలింగంపల్లికి చెందిన గురు ప్రవీణ్ కుమార్, చాందినిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే చాందినికి అంతకుముందే వివాహం జరిగి అయాన్ అనే కుమారుడు ఉన్నాడు. అయినప్పటికి తమ బిడ్డేనని అంగీకరించి ఈ దంపతులు వికారాబాద్‌కు మకాం మర్చారు. వారికి ఏంజెల్ అనే పాప కూడ జన్మించింది.అయితే భార్య చాందిని మొబైల్ ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడుతుందనే అనుమానం గురు ప్రవీణ్‌కుమార్‌కు బలంగా ఉండేది.ఇట్టి విషయంలో చాలా సార్లు గొడవలు జరిగాయి. అయినను మారకపోవడంతో భార్యపైన అనుమానం పెంచుకొని ఈ అనుమానం ఎలాగైనా భార్యను చంపాలనే ఉద్దేశ్యంతో 04.08.2019 రోజురాత్రి పిల్లలు నిద్రించిన తర్వాత కోపంతో తన భార్య చాందినిని ఇనుప రాడ్డుతో కొట్టి చంపాడు. అనంతరం ఆయనే ఇద్దరు పిల్లలైన ఆయాన్ (బాబు)ను రాడ్డుతో కొట్టి, ఏంజెల్(పాప)ను గొంతు పిసికి ధారుణంగా హత్య చేశాడు. ముగ్గిరిని హత్య చేసిన తర్వాత నిందితుడు గురు ప్రవీన్‌కుమార్ తాను రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని రైలు పట్టాల వైపు వెళ్తున్నాడు.మార్గమద్యంలో వికారాబాద్ పోలీస్‌స్టేషన్ కనిపించగా తాను చేసిన నేరాన్ని చెప్పి వెళ్తామని స్టేషన్‌కు వచ్చాడు. పోలీసు అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకొని నేరం జరిగిన ప్రదేశానికి వెళ్ళి పరిశీలించన తర్వాత మొదట ఐఓ అప్పటి టౌన్ ఇన్స్పెక్టర్ మిగతా 2లో

# హ్యాండ్ బ్రేక్ పడక దూసుకెళ్లిన టిప్పర్

- లోడింగ్ అవుతుండగా ప్రమాదం
- డ్రైవర్ మృతి.. మరొక డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

**దౌల్తాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** రెండు టిప్పర్ల మధ్యలో పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని అల్లాపూర్ గ్రామ శివారులో గురువారంరోజు చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. దౌల్తాబాద్ మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు గాను అల్లాపూర్ గ్రామ శివారులోని మొగులాలి తాతగుట్ట నుండి ఎర్రమట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ఈ క్రమంలో జేసీబీ ద్వారా గుట్టపై ఒక టిప్పర్లో మట్టిని లోడ్ చేస్తున్న సమయంలో గుట్ట కింద పక్కనే రెండు టిప్పర్లను లోడ్ నిమిత్తం టిప్పర్ డ్రైవర్లు ఆపి ఉంచారు. ఈ క్రమంలో లోడింగ్ అవుతున్న టిప్పర్ దానంతట అదే హ్యాండ్ బ్రేక్ సరిగ్గా పడక పోవడంతో.. గుట్ట కిందకు టిపర్ల పైకి దూసుకొని వచ్చింది. దీంతో పక్క పక్కనే ఆపి ఉంచిన రెండు టిప్పర్ల డ్రైవర్లు భయంతో టిప్పర్ల నుండి దూకే సందర్భంలో కడప జిల్లా రామాపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్ యాదవ్(26) టిప్పర్ల మధ్య ఇరుక్కొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో టిప్పర్ డ్రైవర్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన గురించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే స్థానిక ఎస్సై బి.రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని ఇట్టి ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృత దేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందిస్తున్న నాయకులు

## లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మిచెక్కుల అందజేత

**కొడంగల్,నవంబరు 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి ,షాదీముబారకన చెక్కులను కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు టీ.భీమయ్య అందజేశారు.గురువారం కొడంగల్ పట్టణంలోని సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం నుండి మంజూరైన కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ చెక్కులను అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదంటి ఆడబిడ్డ పెళ్ళిళ్ళకు మేనమామలా సిఎం రేవంత్‌రెడ్డి కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం 6గురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి ,ఇద్దరికి షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారి గోపాల్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## కుల్కచర్ల పిఎసిఎస్ ఛైర్మన్ మొగులయ్యకు ఉత్తమ అవార్డు

**కుల్కచర్ల, నవంబరు 20, ప్రభాతవార్త :**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రైతులను దృష్టిలో ఉంచుకొని క్రాప్‌లోన్స్, తదతర లోన్స్ అందింస్తు రైతులకు యూరియా, ఫర్టిలైజర్ వంటివి ఇబ్బందులు లేకుండా సేవలు అందించి లోన్స్‌ను రికవరి అనుకున్నంత స్థాయిలో సాధించడంతో అధికారులు గుర్తించి డిసిసిబి డైరెక్టర్, పిఎసిఎస్ ఛైర్మన్ కనకం మొగులయ్యకు గురువారం జిల్లాలో జరిగిన సమావేశంలో ఉత్తమ అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా డిసిసిబి డైరెక్టర్, పిఎసిఎస్ ఛైర్మన్ కనకం మొగులయ్య మాట్లాడుతూ..రైతులకు మెరుగైన సేవలు అందించగలిగామని అన్నారు.భవిష్యత్తులో కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా సొసైటి ద్వారా రైతులకు సేవలను అందిస్తామని పేర్కొన్నారు.ఈ అవార్డు రావడం వెనుక సిబ్బంది పట్టుదల ఉన్నాయని అన్నారు. అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.



అవార్డు అందుకుంటున్న డిసిసిబి డైరెక్టర్, పిఎసిఎస్ ఛైర్మన్ కనకం మొగులయ్య

## టిబి ముక్త్ అభియాన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రభుత్వ వైద్యురాలు బుష్రా**

**కొడంగల్,నవంబరు 20, ప్రభాతవార్త :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న టిబి ముక్తా అభియాన్‌ను సద్వినియోగం చేసుకోవాలని అంగడిరైచూర్ ప్రాథమిక వైద్యురాలు డాక్టర్ బుష్రా తెలిపారు.గురువారం అప్పాయిపల్లి తదతర గ్రామాల్లో టిబి ముక్తా అభియాన్ కార్యక్రమంలో టిబిపరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యురాలు మాట్లాడుతూ సరైన సమయంలో టిబి చికిత్స తీసుకుంటే టిబిను అరికట్టవచ్చన్నారు.దానితో పాటు పోషకాహారం తీసుకుంటే త్వరగా నయం అవుతుందని పేర్కొన్నారు.రెండు వారాలకు మంచి దగ్గు,సాయంత్రం జ్వరం రావడం,ఆకటి మందగించడం,రాత్రి పూట చమటలు పట్టడం తదితర లక్షణాలు ఉంటే కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళి తెమడ పరీక్ష చేయించుకోవాలని డాక్టర్ బుష్రా తెలిపారు.ఈ క్యాంపులో మొత్తం 123 మందికి పరీక్షలు నిర్వహించారు.బిపి,షుగర్ పరీక్షలతో పాటు 45 మందికి తెమడ పరీక్ష కోసం శ్యాంపిల్స్ సేకరించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నిఖిత,ఎంఎల్‌హెచ్‌పి లక్ష్మీ,టిబి సూపర్‌వైజర్ రహత్ అలీ,హెల్త్ అసిస్టెంట్ మధు,సూపర్‌వైజర్ సుశీల,ఎఎన్ఎం మమ్మ,ఆశా కార్యకర్తలు పద్మమ్మ ,మంజుల ,యాదమ్మ,ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

## గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

**కొడంగల్,నవంబరు 20, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామసమీపంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస,డ్రాయింగ్,క్రీడలు నిర్వహించారు.జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఉడిమేశ్వరం సమీపంలోని మహాత్మా జ్యోతిభాపూలే రెసిడెన్షియల్ పాఠశాల,కళాశాలలో పంచాయతీ అధికారి అధ్వర్యంలో బాలసభ కార్యక్రమాన్ని నిర్వహించారు.బాలసభలో పిల్లలతో డ్రాయింగ్ ,క్రీడలు,ఉపన్యాస పోటీలు నిర్వహించి అనంతరం గ్రామాలలో బాలల సమస్యలు ,వారి అవసరాలకు గ్రామ పంచాయతీలు ,ప్రభుత్వాలు చేయవల్సిన పనులను తెలుసుకున్నారు.అనంతరం బాలలు అందించిన సమాచారాన్ని జిల్లా కకలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి బాలరంగాచారీ తెలిపారు.ఈ గ్రామ సభల ద్వారా చిన్న పిల్లల గోడును కూడా విని వారి సమస్యల పరిష్కారానికి స్థానిక సంస్థలు,ప్రభుత్వానికి తగిన సమాచారం లభిస్తుందన్నారు.ఈ కార్య క్రమంలో ఎంపిఒ జయపాల్‌రెడ్డి,కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శులు బాలరంగచారీ, రమేష్‌కుమార్,కల్పన,లావణ్య,మధు,ఆశప్ప,ఉదయ్‌కుమార్,చైతన్యకుమార్,ఏఎన్ఎం,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

## బాలల గ్రామ సభతో విద్యార్థులకు అవగాహన

**చౌడపూర్, నవంబరు 20, ప్రభాతవార్త :** అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యూనిసెఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న



సమస్యల గురించి తెలుసుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలో బాలల గ్రామసభ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా పరిషత్ పరిషత్ ఉన్నత పాఠశాల చౌడాపూర్ లో విద్యార్థులతో కలిసి బాలల గ్రామ సభ విజయవంతంగా నిర్వహించారు.. విద్యార్థుల అవగాహన కల్పించేందుకు నలుగురు పంచాయతీ కార్యదర్శులకు జిల్లా కేంద్రంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. బాలల గ్రామసభలో విద్యార్థులు ఎంతో చురుకుగా పాల్గొనడంతో పాటు, బాలల హక్కులపై వారికి సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థుల యొక్క సూచనలు అంశాలను వారి నుంచి అధికారులు సేకరించారు.. అనంతరం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో పంచాయత్ రాజ్ శాఖ తరఫున మండల ప్రాజా పరిషత్ అభివృద్ధి అధికారి సోమలింగం , తహసిల్దార్ వెంకటేశ్వర్లు, పంచాయతీ అధికారి(ఎంపిఒ) రాజిరెడ్డి, మండల విద్యాధికారి రాంచందర్ , శిక్షణ తీసుకున్న పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్ , మహేష్, చంద్రకాంత్ , సూపరిండెంట్, రమేష్ , పంచాయతీ కార్యదర్శులు మహేష్ రెడ్డి, స్వరూప, రాధా,రాము, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపీ జిల్లా కమిటీలో మేడ్చల్ నాయకులకు చోటు

**మేడ్చల్, నవంబరు 20, ప్రభాతవార్త :** మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి నూతన కమిటీలో ఉమ్మడి మేడ్చల్ మండలంలోని బిజెపి నాయకులు ఎంపిక అయ్యారు. రూరల్ జిల్లా అధ్యక్షుడుగా బుద్ది శ్రీనివాస్ ఇదివరకే ఎంపిక కాగా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశాలతో పూర్తి స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ ఉపాధ్యక్షులుగా మేడ్చల్ పట్టణానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి, ఎల్లంపేటకు చెందిన జగన్ గౌడ్‌తో పాటు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని కండ్లకోయకు చెందిన మాజీ కౌన్సిలర్ హంసరాణి నియమితులయ్యారు. అదే విదంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుండ్లపోచంపల్లికి చెందిన నియోజకవర్గ మాజీ కన్వీనర్ మోహన్‌రెడ్డి నియమించబడ్డారు. కార్యదర్శిగా గౌడవెల్లి గ్రామానికి చెందిన మేడ్చల్ మండల మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కోషాధికారిగా మేడ్చల్ పట్టణానికి చెందిన లవంగ్ శ్రీకాంత్‌లు ఎంపికయ్యారు. మేడ్చల్ నాయకులు చేసిన సేవలను గుర్తించి జిల్లా కమిటీలో అవకాశం కల్పించినందుకు గాను పార్టీ అధిష్టానానికి మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు కృతజ్ఞతలు తెలియజేసి, కమిటీలో స్థానం లభించిన నాయకులకు శుభాకాంక్షలు తెలిజేశారు. మున్సిపల్ కమిటీ సభ్యులు, నాయకులు, జిల్లా కమిటీలో స్థానం లభించిన నాయకులతో కలిసి మేడ్చల్‌లో పార్టీని మరింత అభివృద్ధి చేసే విధంగా సమిష్టిగా ముందుకు సాగుతామని తెలిపారు. కాగా తమపై నమ్మకంతో జిల్లా కమిటీలో స్థానం కల్పించినందుకు గాను అధిష్టానం నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తామని జిల్లా కమిటీలో నూతనంగా ఎంపికైన నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## అన్నాభిషేకంతో ముగిసిన కీసరగుట్ట కార్తీక మాసోత్సవాలు



రామలింగేశ్వరస్వామికి అన్నాభిషేకం చేస్తున్న ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ

**కీసర, నవంబరు20, ప్రభాతవార్త:** తెలంగాణాలోనే సుప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా ముగిసాయి. గురువారం కార్తీక మాసం చివరి రోజు అమావాస్య కావడంతో స్వామివారికి తైలాభిషేకం,అన్నాభిషేకం తదితర పూజాలు జరిగాయి.స్వామివారి దర్శనానికి ఉదయం 4 గంటల నుండే బారులు తీరారు.దీంతో క్యూలైన్లలో రద్దీ ఏర్పడింది.కార్తీక మాసం రోజు స్వామివారికి అభిషేకాలకు ప్రాధాన్యం ఇచ్చిన భక్తులు గంటల తరబడి వేచి ఉండి స్వామివారికి అభిషేకాలు చేసుకున్నారు.అనంతరం ఆలయానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు అభిషేకాలు,పూజలు నిర్వహించారు.ఆలయ ఆవరణలో శివలింగాల వద్ద కార్తీక దీపాలు వెలిగించారు.ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ,ఈఓ కట్లా సుధాకర్‌రెడ్డిలు భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు బోర్డు మెంబర్లు నల్ల మధుసూధన్‌రెడ్డి, రెడ్డబోయిన ప్రవీణ్‌కుమార్,క్రిష్ణారెడ్డి ,రాజు,ముత్యాలు,దుర్గా ప్రసాద్‌గౌడ్,అమరేందర్,కుమార్ .రాజి రెడ్డి,అనిత, శంకరయ్య ,సాయిలు ,ప్రభాకర్‌గౌడ్, సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

## నూతన్‌కల్‌కి బస్సును కొనసాగించాలి

**డిఎంకు గ్రామ నాయకుల వినతి**

**మేడ్చల్, నవంబర్ 20. ప్రభాతవార్త :** ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని నూతన్‌కల్ గ్రామానికి నిలిపివేసిన ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను తిరిగి కొనసాగించాలని కోరుతూ మేడ్చల్ బస్ డిపో మేనేజర్ సుధాకర్‌కు ఆ గ్రామ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నెల 13న గ్రామంలో నైట్ హాల్ట్ చేసిన బస్సులో నుండి గుర్తు తెలియని దుండగులు బ్యాటరీల దొంగతనం చేయడంతో ఆ బస్సు డ్రైవర్‌ని విధుల నుంచి తొలగిస్తూ ఆ రోజు నుండి గ్రామానికి బస్ సర్వీసులను నిలిపివేశారు. బస్సులో నుండి బ్యాటరీలు దొంగతనం చేస్తే బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారని, తిరిగి యధావిధిగా బస్ సర్వీస్‌లను కొనసాగించాలని గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై స్పందించిన డిపో మేనేజర్ స్పందిస్తూ యధావిధిగా బస్సులు నడుపుతాము, కానీ రాత్రికి నూతన్‌కల్ గ్రామంలో బస్‌ను నైట్ హాల్ట్ చేయమని తెలిపారు.



మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నూతన్‌కల్ గ్రామ నాయకులు

ఈ కార్యక్రమంలో పిఎస్‌సిఎస్ ఛైర్మన్ సద్ది సురేష్ రెడ్డి, నూతనకల్ గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షుడు చిన్నోళ్ల భాస్కర్, నాయకులు యూనిస్ పాషా, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## రైతాంగం కోసం కృషిచేసిన రైతు బిడ్డ పి.లక్ష్మారెడ్డి

**..పిఏసిఎస్ ఉత్తమ ఛైర్మెన్‌గా అవార్డు అందుకోవడం అభినందనీయం**

**..తెలంగాణ యూనియన్ యండి. అన్నపూర్ణ**

**పెద్దేముల్, నవంబరు 20, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మెన్ పి. లక్ష్మారెడ్డి ఉత్తమ అవార్డు అందుకోవడం అభినందనీయమని తెలంగాణ యూనియన్ యండి. అన్నపూర్ణ అన్నారు. గురువారం హైద్రాబాద్‌లో నిర్వహించిన 72వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా తట్టెపల్లి ఉత్తమ సహకార సంఘం ఛైర్మెన్‌గా పి,లక్ష్మారెడ్డిని గుర్తించి శాలువాలతో సన్మానించి ఉత్తమ అవార్డును అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ యండి. అన్నపూర్ణ, ప్రిన్సిపాల్ భుక్యా నాయక్ మాట్లాడుతూ పి,లక్ష్మారెడ్డి మొదటి సారి ఛైర్మెన్ అయినప్పుడు 10 గ్రామాల రైతులకు90 లక్షలు రుణాలు అందించే సొసైటిని ప్రస్తుతం రూ. 15 కోట్ల వరకు రుణాలు ఇచ్చేందుకు కృషిచేసారని అన్నారు. రైతులకు ఎరువుల కొరత ఉండకూడదని,వాటిని నిల్వ ఉంచేందుకు గోదాం నిర్మించిడం హర్షనీయమని అన్నారు. నాగులపల్లి గ్రామంలో గోదాం నిర్మాణం కోసం ఒక ఎకరా భూమి కూడా బ్యాంకు పేర రిజిస్ట్రేషన్ చేయించడం గొప్ప విషయమని అన్నారు. రైతాంగం పట్ల, రైతుల పట్ల మంచి అవగాహన ఉన్న వ్యక్తిగా, రైతు కుటుంబంలో పుట్టిన రైతు బిడ్డగాపి.లక్ష్మారెడ్డి మంచి పేరు సంపాదించుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా డిసిఓ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న ఛైర్మెన్ పి.లక్ష్మారెడ్డి

## చేయి చేయి కలిపి బాల్య వివాహాలను అరికడదాం

**ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునితా**



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

**పెద్దేముల్, నవంబరు 20, ప్రభాతవార్త:** బాల్య వివాహల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సునీతా అన్నారు. జిల్లా కలెక్టర్,మహిళాభివృద్ధి సంక్షేమ డిడబ్లు క్రిష్ణవేణి, సిడిపిఓ ఆదేశాల మేరకు గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో బాల్య వివాహలను అరికట్టేందుకు కళాజాతబృందం కళాకారులు ఎం, చిరంజీవి, రవితేజ, శారద, మాధురి దేవి, రవి ప్రసాద్, వర ప్రసాద్‌లచే అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్‌సునీత మాట్లాడుతూ బాల్య వివాహలను రూపుమాపి, వారి జీవితాన్ని ఆనందంగా కొనసాగించేందుకు నడుం బిగించాలని అన్నారు. చేయి చేయి కలిపి బాల్య వివాహలను అరికడదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు లక్ష్మి, విజయలక్ష్మి, రేణుక కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

### బాల్యవివాహం చట్టరీత్యా నేరం

**- కొత్తూరు కేజీబీవీలో అవగాహన**

**కొత్తూరు, నవంబరు 20, ప్రభాతవార్త:** బాల్యవివాహాలు సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతాయని, వాటిని పూర్తిగా నిర్మూలించాలనే బాధ్యత ప్రతి ఒక్కరిదని ఐసీడీఎస్ సూపర్వైజర్ జి. రేవతి అన్నారు. గురువారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కస్తూర్బా బాలికల విద్యాలయం లో గురువారం నిర్వహించిన భేటీ బచావో - భేటీ పడావో మరియు బాల్యవివాహ నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ జి. రేవతి

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఇటువంటి వివాహాలు ఎక్కడైనా జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 1098 హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా సహాయం పొందవచ్చని తెలిపారు. చిన్నతనంలో పెళ్లి చేసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు, సామాజిక ఇబ్బందులు తలెత్తుతాయని రేవతి హెచ్చరించారు. బాలికలు విద్యపై దృష్టి పెట్టి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చదువు ద్వారానే జీవితాన్ని వెలుగులోకి తెచ్చుకోవచ్చని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా బాలికల విద్యాలయ ప్రత్యేక అధికారి శారదా ప్రియాంక, స్థానిక డాక్టర్ పిహెచ్ సి దీప్తి, సిహెచ్‌ఓ నాగేష్, అంగన్ వాడి టీచర్లు వి సుమిత్ర, . అనిత .పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది, పాఠశాల బాలికలు పాల్గొన్నారు.

### కిష్టాపూర్‌లోని సమస్యలుపరిష్కరించాలి

**మేడ్చల్, నవంబరు 20, ప్రభాతవార్త :** మేడ్చల్ పురపాలకసంఘం 4వ వార్డు పరిధిలో గల కిష్టాపూర్‌లో ప్రజలు పలు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ వార్డు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. ముఖ్యంగా నీటి సమస్య, చెత్త సేకరించి వాహనాలు రాకపోవడం, వీధి లైట్లు వెలగకపోవడం వంటి ప్రధాన సమస్యలతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించాడు. మున్సిపల్ కమిషనర్ ప్రజలందరినీ సమస్యలపై ఆరా తీసి వాటి పరిష్కారానికి కృషి చేయాలి కోరాడు.

## ఊపందుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

**నెరవేరుతున్న పేదోడి సొంతింటి కల**



కొండరెడ్డిపల్లిలో ఇంటి నిర్మాణపు పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ ఎఇ

**కొడంగల్, నవంబరు 20, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం మండలంలో ఇల్లు లేని నిరుపేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మండలంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎంపికైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ ఏడాది ఆగస్టులో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలకు గాను ముగ్గులు పోసుకొని పనులు ప్రారంభించారు. ప్రస్తుతం స్లాబ్ లెవల్ వరకు వచ్చాయి. కొడంగల్ మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో 640 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైయ్యాయి. వీటిలో 415 ఇళ్లకు ముగ్గులు పోశారు. అందులో 248 బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చాయి. మరో 62 ఇళ్లు రూఫ్ లెవల్ వరకు చేరుకున్నాయి. 23 ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు వచ్చాయి. అలాగే కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులకు 122 ఇళ్లు మంజూరుకాగా వాటిలో 77 ఇళ్లకు ముగ్గులు పోశారు. మరో 54 ఇళ్ల పనులు బేస్‌మెంట్ లెవల్‌కు వచ్చాయి. 18 ఇళ్లు రూఫ్‌లెవల్ పనులు కొనసాగాయి. 7 ఇళ్లు స్లాబ్‌లు వేశారు. ఇళ్లకు సంబంధించి బిల్లులు 95శాతం పూర్తి అయ్యాయని హౌసింగ్ ఏఈ కానుగంటి భాస్కర్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంత త్వరగా ఇంటి నిర్మాణాం పూర్తి చేసుకుంటే అంతే వేగంగా బిల్లులు చెల్లిస్తామని హౌసింగ్ ఏఈ తెలిపారు. ఆయన గ్రామాల్లో పర్యటిస్తు ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులకు సూచనలు, సలహాలు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయని ఏఈ తెలిపారు. బేస్‌మెంట్ మొదలు కొని స్లాబ్, ఇంటి నిర్మాణాలు పూర్తి అయ్యే వరకు విడుదల వారిగా బిల్లులు వస్తున్నాయని హౌసింగ్ ఏఈ తెలిపారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం**

**నర్సాపురం మల్కమ్మ, చిన్ననందిగామ**



మల్కమ్మ

మాది ఉమ్మడి కుటుంబం,. ఇన్ని రోజులు పాత ఇంట్లో వర్షం వస్తే చాలా ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో మాకు ఇల్లు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. ఇప్పటి వరకు స్లాబ్ వరకు ఇల్లు పూర్తి అయ్యింది. మొదటి బిల్లు కింద రూ.లక్ష ,రెండవ బిల్లు రూ.1లక్ష వచ్చింది. సంతోషంగా నిర్మా ణం పూర్తి చేస్తున్నాం .కాంగ్రెస్ ప్రభు త్వానికి రుణపడి ఉంటాం.



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## ఆధ్యాత్మికతతోనే మానసిన ప్రశాంతత

**మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు**

**కుల్కచర్ల,నవంబరు 20 ప్రభాతవార్త:** ఆధ్యాత్మికతతోనే మానసిన ప్రశాంతత లభిస్తుందని మార్కెట్ కమిటి ఛైర్మన్ ఆంజనేయులు అన్నారు. గురువారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో కార్తీక మాస చివరి రోజుపురస్కరించుకొని భజన మండలి ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు అందకూ కలిసి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి హిందూవు ప్రతి రోజు ఆలయాలను దర్శించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత, హనుమాన్ చాలిసా చదవాలన్నారు. ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజరి, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

## 50 లక్షలతో మార్కెట్ కార్యాలయం ఏర్పాటు

**సర్వసభ్య సమవేశంలో తీర్మానం**



సర్వసభ్య సమవేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్


**కుల్కచర్ల,నవంబరు 20 ప్రభాతవార్త:** కుల్కచర్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటి సర్వసభ్య సమవేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అదేశాల మేరకు మార్కెట్ నూతన ఆఫీసు కార్యాలయానికి రూ.50 లక్షలతో భవనం నిర్మాణం చేపడుతునట్లు తెలిపారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.కుల్కచర్ల మార్కెట్‌ను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ రామ్మోహన్ శర్మ,డైరెక్టర్లు భరత్‌కుమార్ రెడ్డి, శ్రీను, ఖాజ, రాంచద్రయ్య, ఏలయ్య, రాంచదర్ నాయక్, నిల్యా నాయక్, బుగ్గయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలి

**..మహిళలను లక్షాధికారులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**..జిల్లా కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యాక్షులు ఎల్లారెడ్డి**

**పెద్దేముల్, నవంబరు 20, ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాలలో



చెక్కును అందజేస్తున్న దృశ్యం

అభివృద్ధి చెందాలని, వారిని లక్షాధికారులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు ఎస్.ఎల్లారెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలోని 10 సంఘాలకు గాను రూ. 55,38 లక్షల రుణాల చెక్కులను ఎపిఎం శివయ్యతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రజాప్రభుత్వ ఉద్దేశమని అన్నారు.

మహిళలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ రతన్‌సింగ్, నాయకులు శోభారాణి, డివై నర్సిములు, జితేందర్‌రెడ్డి, ప్రవీన్‌కుమార్, యండి.రియాజ్, చారీ, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, గ్రామ సంఘం అధ్యక్షులు గౌసియా, సిసి లక్ష్మన్, విఓఎ సల్మా,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## విఆర్‌ఎల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న విఆర్‌ఎలు

**పెద్దేముల్, నవంబరు 20, ప్రభాతవార్త:** విఆర్‌ఎల స్థానంలో వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని విఆర్‌ఎలు బాలయ్య, శ్రీనివాస్. వెంకటయ్య, ఇస్మాయిలప్ప తదితరులు డిమాండ్ చేశారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంలో తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం అసెంబ్లీలో విఆర్‌ఓలకు పేస్కేలు, వారసులకు ఉగ్యోగాలు ఇస్తామని ప్రకటించిందని, వాటినిఅమలు చేయాలని 80 రోజులుగా దీర్ఘకాలిక సమ్మె పోరాటం ఫలితంగా జిఓ నెం,81,85 విడుదల చేసిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20555 మంది విఆర్‌ఎలలో డిగ్రి చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్లు,ఇంటర్ చదివిన వారిని రికార్డు అసిస్టెంట్లు, పదవ తరగతి చదివిన వారిని ఆఫీస్ సబార్డినేటర్స్‌గా 16758 మందిని నియమించిందని అన్నారు.

మిగతా 3797 మంది విఆర్ఎ వారసు లకు ఉద్యోగ ఉత్తర్వులు ఇవ్వకుండా గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో విఆర్ఎ వారసులకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## పాము కాటుకు గురైన మహిళ

**..గాజీపూర్ గ్రామంలో సంఘటన**

**పెద్దేముల్, నవంబరు 20, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామానికి చెందిన మహిళా పాము కాటుకు గురైంది. గాజీపూర్ గ్రామానికి చెందిన సకీనా గురువారం కూలిపనుల నిమిత్తం గ్రామంలోని ఓ రైతు పొలానికి వెళ్ళగా అక్కడ ప్రమాదవశాత్తు ఆమే చేతిపై నాగుపాము కాటు వేసింది. దీంతోస్థానికులు తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించగా మైరుగైన చికిత్స కోసం వికారాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

పాము కాటుకు గురైన సకీనా భర్త మూడు నెలల క్రితం అనారోగ్యంతో హఠాత్మరణం చెందాడు. వీరికి 5 గురు పిల్లలు ఉండగా వారిలో ఇద్దరికి వివాహం జరుగగా మిగతా ముగ్గురు పిల్లలుఉన్నారు. వీరికి చిన్న ఇల్లు తప్ప ఎలాంటి జీవనాధారం లేనందున ప్రభుత్వం అన్ని విధాలుగా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.




మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.

## పాడైన రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టాలి

**కమిషనర్‌కు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి వినతి**

**ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 20, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ పరిధిలోని చౌదరిగూడలో పలుచోట్ల ఇటీవల వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని వాటికి మరమ్మత్తు పనులు చేపట్టాలని కోరుతూ ఘట్‌కేసర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. వినోద్ కుమార్ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. చౌదరిగూడలోని పలు కాలనీ రోడ్లు వర్షాలకు మట్టికొట్టుకుపోయి గుంతల మయంగా మారాయని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మున్సిపల్ కమిషనర్‌కు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. చౌదరిగూడ గ్రామానికి నిధులు కేటాయించి రోడ్ల మరమ్మత్తుపనులు చేపట్టాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమిషనర్ నిత్యానంద్‌కు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

## హెల్త్ అసిస్టెంట్‌లను రెగ్యులరైజేషన్ చేయాలి

**- రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి**




వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

**రంగారెడ్డి అర్బన్, నవంబరు20, ప్రభాతవార్త:** మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (పురుష) రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం తక్షణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్‌కు గురువారం వినతిపత్రాన్ని అందించినట్లు తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2023మే నెలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెగ్యులర్ రైజ్ చేసినప్పటికీ ,ఇప్పటికీ ప్రొఫెషన్ డిక్లరేషన్, రెగ్యులరైజేషన్ పనులు పెండింగ్‌లో ఉండడం వల్ల ఉద్యో గులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆక్షేపించారు. రెగ్యులరైజేషన్ ఆలస్యంతో కొందరు ఉద్యోగులు రిటైర్ అవ్వగా మరికొందరు మరణించారని, దీంతో వారికి రావలసిన పెన్షన్, గ్రాచ్యుటీ వంటి ఆర్థిక ప్రయోజనాలు కుటుంబీకులకు అందడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు వినతి పత్రాన్ని సమర్పించామని ,వెంటనే ఫైళ్లను పరిశీలించి ఉత్తర్వులు జారీ చేయాలని సాయిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నరేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి మల్లయ్య, కోశాధికారి రామచంద్రయ్య, సంఘ నాయకులు సైదులు, సతీష్, కొండల్ రెడ్డి, రమేష్, అశ్వత్, హాలీం తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ లిస్టులో తప్పులు ఉంటే సరి చేసుకోండి

**కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం**



గూడ వీరేశం

**కేశంపేట, నవంబరు20, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని గ్రామాలలో గ్రామపంచాయతీ ఓటర్ లిస్టులలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లి వాటిని సరి చేసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులకు, గ్రామ కాంగ్రెస్ నాయకులకు, గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించిన కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు గూడ వీరేశం తెలిపారు.

## బాలికలు ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యురాలు సరిత

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు20, ప్రభాతవార్త:** బాలికలు ఆత్మ విశ్వాసం కలిగి ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యురాలు సరిత అన్నారు. గురువారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆద్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలను ప్రజావాణి ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ బాలికలు గౌరవంతో జీవించడం, విద్యను పొందడం, రక్షణ పొందటం బాలికల ప్రాధమిక హక్కు అన్నారు. ప్రతి చిన్నారి ఆత్మ విశ్వాసం ఆనందం సమానత్వం కలిగి ఉండాలని సురక్షితమైన వాతావారణాన్ని అందించాలని ప్రతి పిల్లవాడు భాగస్వామన్ని కావాలని కోరారు. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మాట్లాడుతూ ప్రతి చిన్నారి ఆత్మ విశ్వాసం ఆనందం కలిగి ఎదగాలని మన సమాజంలో అందరికి సమానత్వం అవగాహనతో పాటు మంచి వాతావరణంతో ఉండాలని బాలల హక్కులు రక్షిద్దామని బాల హక్కులు హక్కులని కాపాడాలని అన్నారు. సిడబ్ల్యూసి చైర్ పర్సన్ రాజారెడ్డి మాట్లాడుతూ పిల్లలు ప్రతి ఒక్కరూ విద్యను అందించాలని వాళ్లను విద్యను పొందే హక్కు కలిగి ఉందని మన హక్కుల కోసం పని చేస్తున్నట్లుగా తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ బాలల హక్కుల వాటంకం కలిగితే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. బాలలు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని విద్యతోనే ఏదైనా సాధించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ ఉమాగౌరీ, జిల్లా విద్యా శాఖ అధికారి విజయకుమారి, డిపిఓఆర్ఓ స్వర్ణలత, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు అర్చన, నాగ జయశ్రీ, రాంమోహన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఇంతియాజ్ రహీం, జిల్లా బాలల సంరక్షణ విభాగ సిబ్బంది, జిల్లా బాలల సంరక్షణ నిర్వాహకులు పాల్గొన్నారు.

# 24న కొడంగల్‌లో సిఎం పర్యటన

## సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,ఎస్పీ

**కొడంగల్, నవంబర్ 20, ప్రభాత వార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 24న కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. కొడంగల్‌తో పాటు నియోజకవర్గంలోని దుద్యాల మండలంలోని పోలేపల్లి, హకంపేట్, లగచర్ల ప్రాంతాల్లో సీఎం పర్యటించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో కొడంగల్ మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి గ్రామ శివారులో గల రెండు ఎకరాల భూమిలో అక్షయపాత్ర కిచెన్ షెడ్ భూమిపూజ కోసం స్దలం, మ్యాపును జిల్లా ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. గురువారం సాయంత్రం కొడంగల్ శివారులో గల ఎన్కెపల్లి రోడ్డులో రెండు ఎకరాలలో అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్ షెడ్ భూమిపూజ చేయనున్న సందర్బంగా స్దల పరిశీలిన చేశారు. ఈ సందర్బంగా సంభందిత అధికారులతో చర్చించి ఇట్టి స్దలానికి సంభందించిన మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం హకీంపేట్ శివారు నందు ఎడ్యూకేషన్ హబ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం దుద్యాల మండలంలోని పొలేపల్లి ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్షి చౌదరి, కొడంగల్ కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, డిఎస్పీ శ్రీనివాస్, ఆర్అండ్‌బి అధికారి శ్రీధర్‌రెడ్డి, తహశీల్దార్ రాంబాబు, అక్షయపాత్ర ఫౌండేషన్ చైతన్య శరత్ తదితర

సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్,ఎస్పీ





పోలేపల్లి ఎల్లమ్మను దర్శించుకుంటున్న కలెక్టర్

**సిఎం విద్యాలయాల నిర్మాణానికి శంఖుస్థాపన చేసే అవకాశం !**

### హకీంపేట స్థల పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పి, ఎడ్యుకేషన్ హబ్ అధికారులు

**దుద్యాల, నవంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, కోడంగల్ ఎమ్మెల్యే ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 24న వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అందుకుగాను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్‌పి నారాయన్‌రెడ్డిలతో పాటు ఎడ్యుకేషన్ హబ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయ భాస్కర్‌రెడ్డిలు గురువారం హకీంపేటకు చేరుకొని స్థల పరిశీలన చేశారు. విద్యా సముదాయాల నిర్మాణంలో భాగంగా హకీంపేట శివారులో వివిధ విద్యాసంస్థల నిర్మాణానికి కేటాయించిన స్థల పరిశీలన చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఇక్కడ సభ ఏర్పాటు చేసే అవకాశం ఉండటంతో స్థల పరిశీలన చేశారు. ఇటివలే మెడికల్, నర్సింగ్, పారామెడికల్, ఫిజియోథెరఫీ, ఇంజనీరింగ్, పశువైద్య, మహిళా డిగ్రి కళాశాలనిర్మాణానికి సైనిక్ స్కూల్ యంగ్ ఇండియా, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలకు భూమి కెటాయించారు. వాటిలో ముఖ్యమైన విద్యాలయాలకు ముఖ్యమంత్రిచేతుల మీదుగా శంఖుస్థాపన చేసే అవకాశం ఉంది. ఇందుకుగాను అధికారులు ముందస్తుగానే పర్యవేక్షణ ప్రారంభించారు. హకీంపేట నుంచి జిల్లా కలెక్టర్ ఎస్‌పిలు, పోలేపల్లి ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఎడ్యుకేషన్ హబ్ ఇంజనీర్లు శ్రీనివాస్, రాజయ్య, ఏఈలు జనార్ధన్ మూర్తి, ఆర్‌అండ్‌బి అధికారులు దుద్యాల డిప్యుటి తహసిల్దార్ శివకుమార్, ఆర్ఐ నవీన్, నాయకులు చాకలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

**- రాష్ట్ర ఎస్.సి.ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, నవంబర్ 20 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లాలోని అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్.సి.,ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. గురువారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి డిసిపిలు సత్యనారాయణ, పూర్ణ చంద్రరావు, ఉదయ్ రెడ్డి, ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్.సి., ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య జిల్లా ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు, ఎస్.సి.,ఎస్.టి అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో ల్యాండ్ మరియు అట్రాసిటీ కేసులలో పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపైసమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా ఛైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్లో ఉన్న ఎస్.సి.,ఎస్.టి అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. అన్ని రకాల పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షి ంచబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ వెంకటయ్య అదనపు కలెక్టర్, డి.సీ.పీలకు సూచించారు. పోలీస్ స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీలకు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్.సి.ఎస్.టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.

న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది పని చేయాలని సూచించారు. అధికారులు ఎస్.సి.,ఎస్.టి గురుకుల పాఠశాలలను వసతిగృహాలను తరచు తనిఖీలు చేయాలని విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెరుగైన విద్యను అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్.సి.,ఎస్.టిలకు వేధింపులకు గురిచేసే అధికారులపై కఠిన చర్యలు కమిషన్ తరపున తీసుకున్నట్టు తెలిపారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే అక్కడికి కమిషన్ వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్.సి.,ఎస్.టిలకు సంబంధించిన అన్ని రకాల కేసులను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ప్రతి నెల రోజులకు ఒకసారి ఎస్.సి.ఎస్.టి సమస్యలపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్, ఎస్పీలకు, ఎస్సీ కమిషన్ చైర్మన్ సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ భూమి సమస్యలపై ఆర్డీవోలతో ఎంక్వయిరీ చేయించి ఎస్.సి.,ఎస్.టిలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ఎస్.సి., ఎస్.టిల సంక్షేమం కోసం జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు వసతి గృహాల సమస్యల కోసం పరిష్కారం కోసం చేపట్టిన కార్యక్రమాలను జిల్లా అదనపు కలెక్టర్, ఎస్.సి.,ఎస్.టి కమిషన్ చైర్మన్ కు వివరించారు జిల్లాలో ఉన్న సమస్యలను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.



పిల్లలతో మాట్లాడుతున్న ప్రభుత్వ ఆఫ్ ఇండియా బృందం

## అంగన్‌వాడీ సెంటర్‌ని సందర్శించిన ప్రభుత్వ ఆఫ్ ఇండియా బృందం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబరు20, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా పరిధిలోని శామీర్‌పేట్ మండలం ఉప్పరపల్లి గ్రామాన్ని ప్రభుత్వ ఆఫ్ ఇండియా బృందం డైరెక్టర్ దయా శంకర్, మహిళా అభివృద్ధి, శిశు శ్రేయస్సు శాఖ భారత ప్రభుత్వం పార్లమెంటరీ కమిటీ సభ్యులు సందర్శించారు. అంగన్‌వాడీ కార్యక్రమాన్ని ఈసిఈ అమలు, లబ్దిదారులతో పరస్పర చర్చ, బయట ఆటల కోసం వినియోగించే సామాగ్రి అందుబాటు, వినియోగాన్ని పరిశీలించారు. అలాగే పిల్లలు, గర్భిణీలు, తల్లిపాలు ఇస్తున్న మహిళలతో మాట్లాడి ఐసిడిఎస్ కార్యక్రమాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆహార పంపిణీ విధానం, లబ్దిదారుల రికార్డులు పరిశీలించారు. బృందం సాఖీ వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్‌సి) ఆల్‌వాల్‌ను సందర్శించి బాధిత మహిళలతో సంభాషించారు. అందిస్తున్న సేవలు, సదుపాయాలు సహాయక వ్యవస్దలను సమీక్షించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, జిల్లా వెల్ఫేర్ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.




ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎపిఎం కవిత,తదితరులు

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోండి

**ఎపిఎం కవిత**

**కేశంపేట, నవంబర్ 20 ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రంలోని మహిళా సమైక్య భవనం ఆవరణంలో భూతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా ఖరీఫ్ 2025 26 సంవత్సరంనకు సంబంధించిన దాన్యం కొలుగోళ్ళు చెయ్యాలని రంగారెడ్డి జిల్లా డిఆర్డిఏ నుండి ఆదేశాలు వచ్చాయని ఏపిఎం కవిత తెలిపారు. వరి ధాన్యం ఏ గ్రేట్ రకానికి 2389 రూపాయలు, సాధారణ రకానికి 2,369 రూపాయలకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నరు, సన్న రకం వడ్లకు క్వింటాలకు 500ల రూపాయల చొప్పున బోనస్ అదనంగా ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. మండల పరిధిలోని రైతులు పండించిన దాన్యమును 17 కన్నా తక్కువ శాతం తేమాను కలిగి ఉన్న ధాన్యాన్ని ఐకెపి సెంటర్ కు తీసుకువచ్చి ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంటను దళారులను నమ్ముకుని అమ్ముకొని నష్టపోవద్దని ఆమె రైతులకు సూచించారు.

# రైతుల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

**-రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి -డ్రిప్పు ద్వారా నీటి వృధా కాదు**

**- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి - చౌదరి పల్లిలో రైతు పొలంలో వరి పంట పరిశీలన- రైతు వేదికలో రైతులతో సమావేశం**

**యాచారం, నవంబర్20, ప్రభాతవార్త :** యాచారం మండలంలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలో చౌదర్పల్లి రైతు వేదికలో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. చౌదర్పల్లిలో కోదండ రెడ్డి తోపాటు మరికంటి భవాని, గోపాల్, సెక్రటరీ డి ఉష, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్, జిల్లా ఉద్యాన శాఖ ఏ డి ఏ సుజాత, ఇబ్రహీంపట్నం, యాచారం వ్యవసాయ అధికారులు రవినాథ్ కలిసి కాశమల్ల వెంకట్ రాములు పొలంలోని వరి పంటను పరిశీలించారు. కూరగాయల సాగును పెంచుతూ మార్కెట్ వ్యవస్థను విస్తరించాలని రైతులకు అవగాహన కల్పించారు. యాచారంలో రైతు బజార్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. దళారు వ్యవస్థను తగ్గించడం కోసం, రైతులతో చర్చించారు. డ్రిప్పు తో వ్యవసాయ పొలాన్ని పంటను పండించేందుకు నీటిని ఆదా చేసుకోవడానికి అవసరం ఎంతైనా ఉందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



పంట పొలాల్లో రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులు

# ముఖ్యమంత్రీజీ మాకొద్దీ రీజినల్ రింగ్ రోడ్డు

**-ఆవేదనలో తొమ్మిదిరేకుల గ్రామస్తులు**
**-సీఎం సారూ మీ అపాయింట్మెంట్ ఇవ్వండి**
**-పాలతో మీ కాళ్లు కడుగుతాం**
**- తొమ్మిది రేకుల గ్రామస్తులు రీజనల్ రింగ్ రోడ్డు మార్చండి**
**-మా భూములు మాకు ఇవ్వండి మాజీ సర్పంచ్ కృష్ణవేణి**
**-పెద్దోడికి ఒక న్యాయం.. పేదోడికి ఇంకో న్యాయమా.?**
**-పేదలకు అన్యాయం చేస్తే సహించం**
**-కేశంపేట మండల పర్యటనలో కల్వకుంట్ల కవిత మండిపాటు**

**కేశంపేట, నవంబర్ 20 ప్రభాతవార్త :** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రోజుల గ్రామంలో త్రిపుల్ ఆర్ రోడ్డు వల్ల భూములు కోల్పోతున్న బాధితులను పరామర్శించేందుకు తెలంగాణ జాగృతి షాద్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జి సీమల రమేష్ కురుమ ఆధ్వర్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ˇజనం బాట్ట కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామంలోని పేదలు, అట్టడుగు వర్గాలకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అభివృద్ధి పేరిట పేదల భూములు కొల్లగొట్టేలా, వారి భూములు తీసుకునేలా త్రిపుల్ ఆర్ రోడ్డు వేయడం అన్యాయం. అరకోర భూముల్లోనే పేదలు వ్యవసాయం చేసి జీవిస్తున్నరు. అది కూడా కోల్పోతే వారి కుటుంబాల పరిస్థితి ఏంటి? అంటూ మండిపడ్డారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయ భూములు కేటాయించాలని డిమాండ్ చేస్తూ.. మళ్లీ సర్వే జరిపించి, పేద రైతుల భూములు నష్టపోకుండా ప్రణాళిక రూపొందించేలా పోరాటం చేద్దామని కవిత హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో అపాయింట్మెంట్ తీసుకుందాం. త్వరలోనే కలిసేందుకు ప్రణాళిక చేస్తాం. మీ గోడును బలంగా వినిపిస్తామని తెలిపారు. మీ పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాను. పెద్దోళ్ల భూములు కాపాడుకుని, పేదల భూములు తీసుకునే కుట్రలు ఎవరు చేసినా వదిలేది లేదు అంటూ కవిత స్పష్టంచేశారు. గ్రామంలోని మైనారిటీ నేత ముస్తఫా వెల్లడించిన సమస్యలపై వెంటనే సమాచారం అందించాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డ సురక్షిత జీవితం తమ బాధ్యత అని



సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుంట్ల కవిత

గుర్తుచేశారు. సమస్యల పరిష్కారానికి కమిటీలను ఏర్పాటు చేసి, గ్రామస్థుల ప్రశ్నలకు సమాధానాలు చూపించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరం అయితే కేంద్ర ప్రభుత్వ నేతలను కూడా కలిసి సమస్య వివరించడానికి వెనకాడము. తెలంగాణ అంటే ఉద్యమాల గడ్డ.. ఇక్కడ హక్కుల కోసం ఎప్పుడూ పిడికిలి బిగించి పోరాడి సాధించుకున్నాం. పెద్దోడికి ఒక న్యాయం, పేదోడికి మరో న్యాయం అనే పరిస్థితిని ఇక ఎవరూ అంగీకరించరని కవిత హెచ్చరించారు. భూమి అనేది రైతు ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ.. భూమిని రక్షించుకునే పోరాటాన్ని చిట్యాల ఐలమ్మ ధైర్యం, పోరాటస్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. గ్రామస్తులు తమ సమస్యలను కవిత ముందు ఉంచగా, వాటిని సమగ్రంగా పరిశీలించి పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని కవిత హామీ ఇచ్చారు. ప్రజలు ధైర్యంగా ముందుకొచ్చి తమ హక్కులను రక్షించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.